

నిరీక్షణ...!

- కరెంటు కనెక్షన్ల కోసం రైతుల కష్టాలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11,950 దరఖాస్తులు పెండింగ్
- ఎమ్మిగనూరు 220 కేవీ సబ్ స్టేషన్‌కు మోక్షం లభించేనా..?
- ప్రతిపాదనల్లోనే సబ్ స్టేషన్ల నిర్మాణం
- లో ఓల్టేజీ సమస్యలతో అన్నదాతల అవస్థలు
- నేడు విద్యుత్ నియంత్రణ మండలి అధికారుల ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు ఎన్నో నెలలుగా నిరీక్షిస్తున్నారు. డిపాజిట్ చెల్లించినా కరెంట్ కనెక్షన్లు ఇవ్వడం లేదు. 2023 సెప్టెంబరు నుంచి డిపాజిట్ చెల్లించిన రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి బోరుబావులు తవ్వకున్న అన్నదాతలు కరెంటు లేకపోవడంతో అప్పులపాలవుతున్నారు. అదే క్రమంలో విద్యుత్ వినియోగం, కనెక్షన్లు పెరుగుతున్నా.. అవసరమైన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టడం లేదు. ఫలితంగా లో ఓల్టేజీ సమస్యతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వ్యవసాయ పంపుసెట్లు కాలిపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్య నివారణకు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 37 దాకా 33/11 కేవీ సబ్ స్టేషన్లు నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించారు. ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద నిర్మించాల్సిన 220 కేవీ సబ్ స్టేషన్‌కు మోక్షం ఎప్పుడని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో రైతుల్లో ఆశలు చిగురించినా.. పెండింగ్ దరఖాస్తులు మాత్రం కదలడం లేదు. నేడు 2025-26 విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ కోసం కర్నూలుకు వస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ), దక్షిణ మండల విద్యుత్ పంపిణీ వ్యవస్థ (ఎస్‌పీడీసీఎల్) ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాల్సి ఉంది.

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ విద్యుత్ శాఖ డివిజన్లు ఉన్నాయి. వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు 15 లక్షలకు పైగానే ఉన్నాయి. వ్యవసాయ వినియోగ విద్యుత్ కనెక్షన్లు కర్నూలు జిల్లాలో 1.10 లక్షలు, నంద్యాల జిల్లాలో 1.05 లక్షలు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 20 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. రెండు జిల్లాల్లో జనాభాతో పాటు నివాసాలు, వ్యాపారాలు పెరగడం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కూడా పెరుగుతున్నాయి. దీంతో వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో ఓల్టేజీ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే క్రమంలో సాగుపై మక్కువతో రూ.లక్షలు ఖర్చు చేసి బోరుబావులు చేపట్టారు. రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా డిపాజిట్ చెల్లించిన రైతులు కరెంట్ కనెక్షన్ కోసం ఏడాదిన్నరగా నిరీక్షిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో కష్టాలు తీరుతాయని రైతులు ఆశిస్తే.. ఆ దిశగా చర్యలు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీటిపై దృష్టి సారించాలి

- కర్నూలు జిల్లాలో 7,500, నంద్యాల జిల్లాలో 4,450 మంది రైతులు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేశారు. ఒక్కో రైతు ఎంత తక్కువ కాదన్నా రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా డిపాజిట్ చేశారు. మెజార్టీ రైతులు వందరూపాయలకు రూ.2 వడ్డీతో అప్పు చేసినవారే ఉన్నారు. 2023 సెప్టెంబరు నుంచి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త కనెక్షన్లతో పాటు అవసరమైన విద్యుత్ పరికరాలు మంజూరు చేయాలి.
- విద్యుత్ లో ఓల్టేజీ సమస్య నివారణకు కర్నూలు జిల్లాలో 22, నంద్యాల జిల్లాలో 15 వరకు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాల కోసం ఎస్‌పీడీసీఎల్‌కు స్థానిక విద్యుత్ ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. ఒక్కో సబ్ స్టేషన్ నిర్మాణానికి సరాసరి రూ.3 కోట్లు చొప్పున 37 సబ్ స్టేషన్లకు రూ.111 కోట్లు నిధులు మంజూరు చేయాలి.
- ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాలకు అనంతపురం జిల్లా గుత్తి 220 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వేసవిలో విద్యుత్ కోతల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి 50 ఎకరాల భూమిని కూడా కేటాయించారు. రూ.120 కోట్లతో ఈ సబ్ స్టేషన్ నిర్మిస్తే.. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం పల్లెసీమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయవచ్చు.
- ఉమ్మడి జిల్లాలో ఏడీఈఈలు నాలుగురు, ఏఈఈలు 32 మంది కొరత ఉంది. ఈ ఖాళీలు భర్తీ చేయాలి.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు నగర శివారులో ఉన్న దిన్నెదేవరపాడు దగ్గర ఉన్న విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగంపై 2025-26 టారీఫ్ ఖరారు కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఆ కార్యక్రమంలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్ రాంసింగ్, ఫైనాన్స్ సభ్యుడు రామకృష్ణ, విద్యుత్ పంపిణీ వ్యవస్థల విజయవాడ, విశాఖ, తిరుపతి సీఎండీలు పటాన్‌శెట్టి రవికుమార్, పృథ్వితేజ్, కె.సంతోశ్‌రావు, ట్రాన్స్‌కో సీఎండీ, జేఎండీ సహా డైరెక్టర్లు పాల్గొంటారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుంది. 2 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్, 3 నుంచి 4 గంటల వరకు ప్రజల అభిప్రాయాలు, సలహాలు, సూచనలపై సీఎండీల వివరణ ఉంటుంది. ప్రజల నుంచి లిఖిత పూర్వకంగా లేదా నేరుగా చెప్పే అభిప్రాయాలను స్వీకరిస్తారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు.



సకల పుణ్యఫలం

ఉత్తర ద్వార దర్శనం

- నేడు వైకుంఠ ఏకాదశి
- ముస్తాబైన ఆలయాలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

నంద్యాల కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో వచ్చే ఏకాదశి రోజుకు ఒక ప్రత్యేకత ఉంది. ఆ ఏకాదశినే వైకుంఠ ఏకాదశిగా పేర్కొంటారు. ఆరోజున మహా విష్ణువు వైకుంఠంలో ఉత్తరం వైపు ఉన్న ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి కోర్కెలు తీరుస్తాడని హిందూ పురాణాలు పేర్కొంటాయి. ఈ నేపథ్యంలో వైష్ణవ భక్తులు పరమ పవిత్రమైన వేడుకగా 'వైకుంఠ ఏకాదశి'ని నిర్వహిస్తారు. ఈ వేడుక సందర్భంగా శుక్రవారం జిల్లాలోని వైష్ణవ దేవాలయాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలతోపాటు స్వామివారిని ఉత్తర 'ద్వారం' ద్వారా భక్తులకు దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు. ఏటా ఒక రోజు వచ్చే వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలను ప్రత్యేక అలంకారాలతో తీర్చిదిద్దారు. ఉత్తర ద్వారం వద్ద ద్వారాలను పుష్పాలతో తీర్చిదిద్దారు. ఉత్తర ద్వారం ద్వారా ఆలయ ప్రవేశానికి బారికేడ్లు, క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

ఏడాది పొడవునా ఉత్తర ద్వార దర్శనమే

చాగలమర్రి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఉత్తర ద్వార దర్శనం వైకుంఠ ఏకాదశి రోజున మాత్రమే ఉంటుంది. కానీ చాగలమర్రి మండలం మద్దూరు గ్రామంలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాత్రం ఏడాది పొడవునా ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకోవచ్చు. 500 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఉత్తర ముఖద్వారంతో లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర ఆలయాన్ని నిర్మించారు. శ్రీకృష్ణదేవరాయలు నల్లమల అడవి గుండా శ్రీశైలం నుంచి అహోబిలం వచ్చి అక్కడి నుంచి వెంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వెళ్తూ మార్గం మధ్యలోని మద్దూరు గ్రామంలో బస చేశారు. రాయల వారు నిత్యం నిద్ర లేచిన వెంటనే వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అయితే అడవిలో ఆలయం లేకపోవడంతో స్వామివారిని దర్శనం చేసుకోవడం ఎలా అని ఆలోచించి తెల్లవారే లోగా ఆయన బస చేసిన ఇంటికి ఎదురుగానే ఉత్తరముఖంగా ఆలయాన్ని నిర్మించినట్లు స్థానికంగా ఉన్న చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 11న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మామిడికిషోర్‌శర్మ తెలిపారు.



పూజలందుకుంటున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి

పారిశుధ్యానికి ప్రాధాన్యత

జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓ, ఈఓఆర్డీ, డీఎల్‌పీఓలకు డీపీఆర్‌సీలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణకు ముఖ్యఅతిథిగా హాజరైన సీఈఓ మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ప్రతి ఫిల్లింగ్‌కు క్లోరినేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ ఆస్తులు వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఘనవ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. పారిశుధ్యం విషయంలో నిబంధనల మేరకు నిధులు వెచ్చించి గ్రామాల్లో కనీస సదుపాయాలు కల్పించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ మంజుల వాణి, ఎంటీటీలు శ్రీనివాసులు, రఘునాథ్, రవికిశోర్, నగేష్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.నాసరరెడ్డి

మండల పరిషత్‌లకు నిధులు మంజూరు

కర్నూలు న్యూసిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల పరిషత్‌లకు సంబంధించి పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 53 మండల ప్రజా పరిషత్‌లకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. తలసరి గ్రాంటు రూ.1,52,35,944, సీనరేజీ గ్రాంటు రూ.3,93,44,687, ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.2,25,95,586 విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని మండల ప్రజాపరిషత్‌కు నిధులు జమచేశారన్నారు. ఎంపీడీఓలు ప్రభుత్వ నిబంధనల మేరకు నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆదేశించారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

నంద్యాల కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా 115 అదనపు బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు హైదరాబాదుతో పాటు, విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు అదనపు సర్వీసులు ఉంటాయన్నారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు రాకపోకల నిమిత్తం ఈ సర్వీసులను ఏర్పాటు చేశామని చెప్పారు. తిరుగు ప్రయాణానికి అదనపు చార్జీలు ఉండబోవని, పండుగకు వచ్చే ప్రయాణికులు ఒకేసారి రానుపోను(తిరుగు) ప్రయాణానికి టికెట్ కూడా రిజర్వేషన్ చేసుకుంటే చార్జీలో పది శాతం రాయితీ ఉంటుందన్నారు. డిమాండ్‌ను బట్టి బస్సుల సంఖ్య కూడా పెంచుతామన్నారు. వివిధ డిపోల నుంచి హైదరాబాదుకు 38, విజయవాడకు 8, బెంగళూరుకు బస్సులు ఉండగా, వీటికి అదనంగా 115 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. నంద్యాల డిపో నుంచి 20 బస్సులను అదనంగా ఏర్పాటు చేశామని నంద్యాల డిపో మేనేజర్ గంగాధర రావు వివరించారు.

మల్లన్న హుండీ ఆదాయం

రూ.3.39 కోట్లు

శ్రీశైలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈ హుండీల ద్వారా రూ.3,39,61,457 నగదు రాబడిగా లభించింది. ఈ హుండీ ఆదాయాన్ని భక్తులు గత 23 రోజుల్లో సమర్పించారు. నగదుతో పాటు 139.2 గ్రాముల బంగారు, 5.4 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 481 యుఎస్ఏ డాలర్లు, 60 ఆస్ట్రేలియా డాలర్లు, 140 యూఏఈ దిర్హమ్స్, 35 కెనడా డాలర్లు, 2000 ఉగండా షిల్లింగ్స్ మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఆలయ అధికారుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపును నిర్వహించారు. ఈ లెక్కింపులో ఆలయ అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.



మల్లన్న కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈవో జనార్దన్ రెడ్డి



కేజీబీవీలో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్ రెడ్డి

మిడుతూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో జనార్దన్ రెడ్డి అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల, ప్రైవేటు స్కూల్ చెన్నకేశవ పాఠశాలలను గురువారం డీఈవో తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో పరిస్థితులను ఆయన పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభను తెలుసుకున్నారు. పాఠశాలలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహిస్తున్న స్టడీ అవర్సును డీఈవో పరిశీలించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ఉదయం 9 గంటలు కావస్తున్నా స్టడీ అవర్స్ నిర్వహించేందుకు ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కానందున వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టడీ అవర్స్‌కు వంద మంది హాజరు కావాల్సి ఉండగా 20 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనందుకు ఉపాధ్యాయుడికి, పాఠశాల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు డీఈవో జనార్దన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో 1 ఫయిజున్నిసా, ఎంఈవో 2 శ్రీనాథ్, కస్తూర్బా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, చెన్నకేశవ పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

చాక్‌పీస్‌పై దశావతారాలు

నిత్యం తన కళలతో ఆకట్టుకునే చిత్రకారుడు కోటేష్ మరోసారి తన టాలెంట్‌ను ప్రదర్శించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా చాక్‌పీస్‌కు ఇరువైపుల మహావిష్ణుమూర్తి దశావతారాలు పెయింటింగ్ వేశారు. వాటర్ కలర్స్‌తో మైక్రోబ్రష్ ద్వారా ప్రముఖ చిత్రకారుడు, హంస అవార్డు గ్రహీత చింతలపల్లె కోటేష్ వినూత్నంగా వేశారు. కోటేష్ వేసిన ఈ చిత్రంలో వెంకటేశ్వరస్వామి అవతారం, నరసింహ, వరాహ, వామన, కూర్మ, మత్స్య, పరశురామ, రాముడు, కృష్ణుడు, కల్కి ఇలా పది అవతారాలను అద్భుతంగా చిత్రీకరించాడు. కోటేష్ ప్రతిభపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

-నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)



నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

నంద్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డీఈఓ జనార్దన్ రెడ్డి గురువారం తెలిపారు. పండుగ అనంతరం పాఠశాలలు 20వ తేదీ సోమవారం పునఃప్రారంభమవుతాయన్నారు. సంక్రాంతి సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటూ అసైన్‌మెంట్ నిర్వహించడం, సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేసి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు.

శ్రీశైలంలో నేడు స్వామి, అమ్మవార్లకు పుష్పార్చన

శ్రీశైలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష అర్చనలు, గ్రామోత్సవం, సాయంత్రం విశేష పుష్పార్చనకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు దేవస్థానం పరిపాలనా భవనంలోని సమావేశమందిరంలో ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానం వైదిక కమిటీ సూచనల మేరకు లోకకల్యాణం కోసం జరిపే ఈ ఉత్సవం, పుష్పార్చన కైంకర్యాలు సంపూర్ణంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిర్వహించే గ్రామోత్సవంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూడాలని ఇంజనీరింగ్, భద్రతా విభాగాన్ని ఆదేశించారు. వేడుకలను శ్రీశైలటీవీ, యూట్యూబ్ చానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని చేయాలని అధికారులను ఆదేశించారు.

కరువు నేలపై సూర్యకాంతి



కరువునేలపై సూర్యకాంతి ప్రసరించనుంది. పత్తికొండ మండలం హోసూరు - పెద్దహుల్తి గ్రామాల నడుమ 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 కింద చేపట్టనున్న ఈ ప్రాజెక్టును ప్రభుత్వం టాటా పవర్ రిమ్యునబుల్ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీకి కేటాయించింది. ఈ మేరకు రెండు రోజుల కింద జీవోను విడుదల చేసింది. 1800 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న ఈ సోలార్ పవర్ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా 1400 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

- హోసూరు - పెద్దహుల్తి గ్రామాల మధ్య సోలార్ ప్లాంట్
- 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- పనులు ప్రారంభించనున్న టాటా పవర్
- స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు

పత్తికొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 రూపొందించి 2024 అక్టోబరు 10న జీవోనెం 37ను విడుదల చేసింది. ఈ పాలసీ ద్వారా కంపెనీలకు పెట్టుబడులను అహ్వానిస్తూ 2024 డిసెంబరు 30న స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపిబి) సమావేశం నిర్వహించి కంపెనీలను పెట్టుబడులకు ఆహ్వానించింది. కర్నూలు జిల్లా హోసూరు - పెద్దహుల్తి మధ్య 400 మెగావాట్ల విద్యుత్ లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేయదలచుకున్న సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు టాటా పవర్ రిమ్యునబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టిపిఆర్ఈఎల్) ముందుకు వచ్చి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఈ మేరకు ప్రభుత్వం టాటా ఎనర్జీ కంపెనీ వాటాదారులతో సంప్రదింపులు జరిపింది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 నిబంధనలకు అనుగుణంగా సోలార్ పవర్ ప్రాజెక్టు పనులు జరగాలని సూచించింది. ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ఇప్పటికే ఉన్న విండ్ ఇతర ప్రాజెక్టు పనులకు ఆటంకం కలిగించరాదని నిబంధనల్లో పేర్కొంది. సోలార్ పవర్ ప్రాజెక్టు ద్వారా తయారయ్యే సౌర విద్యుత్ వినియోగంపై కూడా నిబంధనలు విధించి ప్రాజెక్టును టాటా ఎనర్జీకి అనుమతులు మంజూరు చేసింది.

30ఏళ్ల లీజుకు భూముల కేటాయింపు..

400 మెగావాట్ల సోలార్ వపర్ ప్రాజెక్టు కోసం 1800 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించనుంది. రెండు గ్రామాల పరిధిలో ఉన్న రెవెన్యూ, ప్రభుత్వ, ప్రైవేటు, పట్టా భూములను 30ఏళ్ల లీజుకు టాటా ఎనర్జీకి కేటాయించనుంది. ఈ భూములకు నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ గుర్తింపును ప్రభుత్వం ఇవ్వనుంది. ఇందు కోసం భూ యజమానులు భూ వినియోగం మార్పు కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. భూ యజమానులు చెల్లించాల్సిన రుసుముపై ప్రభుత్వం మినహాయింపు ప్రకటించింది. 30 ఏళ్లపాటు భూమి వినియోగ హక్కులు టాటా ఎనర్జీ సంస్థకే చెందుతాయి. ఈ తతంగానికి సంబంధించిన అన్ని ఖర్చులను కంపెనీయే భరించాలి. ఎకరాకు ఏడాదికి రూ31,000 లీజు చెల్లించాలని, 2 సంవత్సరాలకు ఒకసారి 5శాతం లీజు ధరను పెంచాలని ప్రభుత్వం నిబంధనల్లో పేర్కొంది. కంపెనీ నిర్మాణదశ నుండి భూ హక్కుదారులకు లీజును కంపెనీ చెల్లించాలని, ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 నిబంధనల మేరకు ఈ సోలార్ ప్రాజెక్టు నిర్మాణాన్ని 24నెలల్లోపు పూర్తిచేయాలని జీవోలో పేర్కొంది.

స్థానిక యువతకు ఉపాధి

సోలార్ పవర్ ప్రాజెక్టు ద్వారా సుమారు 1400 మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు అందనున్నాయి. వ్యవసాయమే ప్రధాన జీవనాధరమైన పత్తికొండ ప్రాంతంలో యువత ఉద్యోగావకాశాల కోసం సుదూర ప్రాంతాలకు వెళుతుంటారు. స్థానికంగా ఇంతపెద్ద ప్రాజెక్టు నిర్మాణమైతే తమ పిల్లలకు ఇక్కడే ఉపాధి దొరుకుతుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం



రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాల కల్పించడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అన్ని రకాలుగా వెనుకబడ్డ పత్తికొండ ప్రాంతానికి ప్రాజెక్టులను కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును పలుసార్లు కోరాం. రాష్ట్రంలో చేపట్టనున్న భారీ ప్రాజెక్టులలో 400 మెగవాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును సీఎం పత్తికొండ ప్రాంతానికి కేటాయించారు. ఈ ప్రాజెక్టుకు అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా సహకరించాలి.

- కేఈ శ్యాంబాబు, పత్తికొండ ఎమ్మెల్యే



చారిత్రాత్మక కట్టడాలను కాపాడుకోవాలి

జిల్లా పర్యాటక శాఖ అధికారి పి. విజయ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, సీనియర్ సిటిజన్లు

కర్నూలు న్యూసిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కట్టడాలను ప్రతి ఒక్కరు కాపాడుకునే విధంగా కృషి చేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.విజయ అన్నారు. గుత్తి కోట సంరక్షణ సమితి టీం అధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను గురువారం కొండారెడ్డి బురుజు వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గుత్తికోట సంరక్షణ కమిటీ గౌరవ సలహాదారులు సూర్యనారాయణరెడ్డి, చరిత్రకారులు కల్కూర చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ సంరక్షణ సమితి రూపొందించిన క్యాలెండర్‌లో జిల్లా పర్యాటక ప్రాంతాలు ఉండటం హర్షణీయమన్నారు. కల్కూర చంద్రశేఖర్ మాట్లాడుతూ చరిత్ర కలిగిన ప్రదేశాలను ఎలా సంరక్షించాలన్న అంశంపై భావితరాలకు తెలియజే యాలన్నారు. గుత్తి కోటకు, కర్నూలు కొండారెడ్డి బురుజుకు ఎన్నో వంద సంవత్సరాల ఘన చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు ఇమ్మానుయేల్, ప్రకాష్, వీరశైవ లింగాయత్ ఓబీసీ సాధన సమితి నాయకులు వీరభద్రప్ప, విజయ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సభ విజయవంతం

వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే ఈనెల 5న విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సభ విజయవంతమైందని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేశ్ అన్నారు. గురువారం నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లోగల వినాయక మందిరం సమావేశ హాలు లో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటూ ఇతర రాష్ట్రాలోని హిందువులంతా తరలిరావడం ఎంతో సంతోషదాయకమని చెప్పారు. బుధవారం తిరుమల ఘటనపై వారు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, అమాయకుల మరణా నికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్, ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, సహ కార్యదర్శి ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

ముస్తాబైన అహోబిలం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లో స్వామి వారిని ఉత్తరద్వారం ద్వారా భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలో స్వయంభువుగా వెలసిన సర్వలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో, యర్రగుంట్లలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు గ్రూపు దేవాలయాల ఈఓ టీవీ నరసయ్య తెలిపారు.

ఇజ్‌తెమాలో దువా చేస్తున్న భక్తులు



ప్రశాంతంగా ముగిసిన ఇజితెమా..!

- చివరి రోజు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆధ్యాత్మిక ప్రసంగాలు వినిపించిన ఉలేమాలు
- సామూహిక దువా అనంతరం ముగిసిన వేడుక



తిరుగు ప్రయాణంలో రద్దీ

ఆత్మకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు కేంద్రంగా మూడురోజుల పాటు జరిగిన ఉమూమి తబ్లిగీ ఇజితెమా గురువారం మధ్యాహ్నం ప్రశాంతంగా ముగిసింది. చివరి రోజు జరిగిన సామూహిక దువా కార్యక్రమానికి లక్షలాదిగా హాజరయ్యారు. ఇజితెమాలో జరిగే ఈ దువా కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం రాత్రికే లక్షలాదిగా ఇజితెమా ప్రాంగణానికి చేరుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే సామూహిక ప్రార్థనలు చేపట్టారు. ఆ తర్వాత ముంబై, నిజామోద్దిన్, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలతో పాటు ప్రపంచశాంతి, దేశ ఔన్నత్యం గురించి వివరించారు. సర్వమానవాళి సమానమేనని అందరి పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ, ఆప్యాయతను కలిగి ఉండాలని ఉపదేశించారు. మతాలకు అతీతంగా దేశ ఐక్యతను కాపాడుకుందామని ఉద్బోధించారు. ఆ తర్వాత 12.30 గంటల సమయంలో సామూహిక దువాను నిర్వహించిన అనంతరం మధ్యాహ్న నమాజ్‌ను పూర్తి చేసుకుని ఇజితెమా వేడుకలకు ముగింపు పలికారు. ఇదిలా వుంటే చివరి రోజు కూడా ఇజితెమాకు వచ్చిన వారికి నిర్వహణ కమిటీ వారు భారీ ఏర్పాట్లను కల్పించారు. వచ్చిన వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపుగదులు, విద్యుత్ సదుపాయం సమకూర్చారు. అదేక్రమంలో 17 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిన సౌకర్యవంతమైన భోజన వసతిని కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి దాతలు ఇజితెమాకు వచ్చిన వారికి మజ్జిగ, పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను సిద్ధం చేశారు. అలాగే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారు. ఇజితెమా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల్లో కొనుగోళ్లు ఉత్సాహంగా సాగాయి. చివరి రోజు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఇజితెమా కార్యక్రమాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లపై కమిటీని అభినందించారు.



ఇజితెమా ప్రాంగణంలో పర్యవేక్షిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

ట్రాఫిక్‌ను పర్యవేక్షించిన ఎస్పీ

గురువారం ఉదయం నుంచే నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఇజితెమా సందర్భంగా ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. ఇజితెమా అనంతరం తిరుగు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టారు. ఆయా పార్కింగ్ ప్రదేశాల నుంచి నిర్దేశించిన రూట్లలో వాహనాలను మళ్లించారు. నంద్యాల టర్నింగ్ వద్దకు ఆయన చేరుకుని ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. ఇజితెమా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అపశృతులు చోటు చేసుకోకుండా ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, అర్బన్ సీఐ డీ. రాము, రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



వజూ చేసుకుంటున్న భక్తులు

సైకిల్ మీద దేశాటన

- సేవ్ నేచర్ సేవ్ లైఫ్ అంటున్న జార్ఖండ్ యువకుడు
- నందికొట్కూరుకు చేరుకున్న సైకిల్ యాత్ర



నందికొట్కూరులో జార్ఖండ్ యువకుడి సైకిల్ యాత్ర

నంది కొట్కూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సేవ్ నేచర్ సేవ్ లైఫ్, క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా అనే నినాదాలతో భారతదేశ వ్యాప్తంగా జాతీయ జెండాను చేతబట్టి జార్ఖండ్‌కు చెందిన నాగేశ్వర్ సైకిల్ యాత్ర చేపట్టాడు. కర్నూలు నుంచి 340-సి జాతీయ రహదారిపై శ్రీశైలం వెళ్తున్న ఆ యువకుడిని నందికొట్కూరు వద్ద ఆంధ్రజ్యోతి పలకరించింది. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ సైకిల్ యాత్రను 2023 డిసెంబరు 9వ తేదీన ప్రారంభించానన్నారు. శ్రీశైలం నుంచి తెలంగాణ మీదుగా పర్యటించి మరో ఐదు నెలల తర్వాత ఈ సైకిల్ యాత్రను తిరిగి జార్ఖండ్‌లోనే ముగిస్తానన్నారు.

నేటి నుంచి టీజీవీ కళాక్షేత్రంలో జాతీయ స్థాయి నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద నృత్యపోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీనటరాజ నృత్య కళామందిర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నృత్య గురువు ఎస్.కరీముల్లా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీనటరాజ నృత్య కళామందిర్ దశమ వార్షికోత్సవం సందర్భంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను శుక్రవారం సాయంత్రం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ప్రముఖ పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించే గ్రూపు, సోలో నృత్యాల పోటీల్లో విజేతలకు వేర్వేరుగా నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

కర్నూలు కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ అధికారి టి. శారద అన్నారు. గురువారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో, కిశోరి వికాసం కార్యక్రమాన్ని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టి. శారద మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలకు పాల్పడినా, ప్రోత్సహించినా బాల్య వివాహ నిరోధక చట్టం 2006 సెక్షన్ 9, 10, 11(1) ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పీఓఐసీ పద్మ, శేషమ్మ, ఆంజనే యులు, రాముడు, నాగన్న, షాలుమియా పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శారద



భక్తుల మృతి బాధాకరం

• కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి స్వామివారి సన్నిధిలోని వైకుంఠ ద్వారం వద్ద తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధారమని, తనను తీవ్ర మనోవేదనకు గురి చేసిందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా టీటీడీ మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని అన్నారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందన్నారు.

ఆ ఘటన దురదృష్టకరం

• పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటన అత్యంత బాధాకరమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఇతర రాష్ట్రాల నుండి తిరుపతికి వచ్చిన భక్తులు కూడా మృత్యువాత పడటం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

• జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ

కర్నూలు అర్బన్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటన అత్యంత బాధాకరమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పి. మురళికృష్ణ పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులు తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం, ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

పల్వరైజర్ మిషన్‌లో పడి మహిళకు తీవ్ర గాయాలు

నంద్యాల క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని గోకుల్‌దాల్ మిల్లులోని పల్వరైజర్ మిషన్‌లో పడి ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన రాజేశ్వరి అనే మహిళ దాల్ మిల్లులో పనిచేస్తూ గురువారం పల్వరైజర్ మిషన్‌లో పడి గాయపడ్డారు. మహిళను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మహిళ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

తుగ్గలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాలేదని మనస్తాపంతో శివశంకర్ (38) అనే వ్యక్తి గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని జి. ఎర్రగుడిలో ఉంటున్న రామాంజనేయులు కుమారుడు శివశంకర్‌కు వరలక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన శివశంకర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ కేసు నమోదు చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నిందితుడికి జైలు, జరిమానా

కర్నూల లీగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధించిన నిందితుడికి మూడేళ్ల కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా పోక్సో కోర్టు న్యాయధికారి భూపాల్ రెడ్డి గురువారం తీర్పు చెప్పారు. స్థానిక బుధవారపేటకు చెందిన నిందితుడు బొగ్గుల రాజేష్ 2021 జూన్ నెలలో బాలికను మభ్యపెట్టి అసభ్యకరమైన ఫొటోలు చూపిస్తూ లైంగింకంగా వేధించాడు. దీంతో బాలిక తల్లి 2021 జూన్ 23న కర్నూలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వరరెడ్డి, ప్రతాప్ రెడ్డి వాదించారు.

పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ

నిందితుడిపై తక్షణమే కేసు నమోదు చేసి విచారణలో కట్టుదిట్టంగా వ్యవహరించి నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ జి.బిందుమాధవ్ అభినందించారు. త్రీటౌన్ ఎస్ఐ రహ్మతుల్లా, మహిళా పీఎస్ ఎస్ఐ కొండయ్య, సిబ్బందిని అభినందించారు.

దిశ వన్ స్టాప్ కేంద్రం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూల లీగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక దిశ వన్ స్టాప్ సెంటర్‌ను, మహిళా ప్రాంగణాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. కార్యాలయం సందర్శించి రికార్డులను పరిశీలించి, సౌకర్యాల గురించి అక్కడ ఉంటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో డ్రైనేజీ అపరిశుభ్రతపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరికైనా లీగల్ సర్వీసెస్ చట్టం కింద ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీపీవో శారద, అధికారులు పాల్గొన్నారు.

'108'ని ప్రభుత్వమే నిర్వహించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ కుమార్

కర్నూలు హాస్పిటల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని 108 కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని సీఐటీయూ ఆఫీసులో గురువారం ఉమ్మడి జిల్లా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో 108 ఉద్యోగు లకు వెయిటేజ్ మార్కులు వంటి ప్రయోజనాలు అందించారని ముఖ్య మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం లేకుండా బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో 108 ఈయూ ఉమ్మడి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాస్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీపీ నరసింహారావు, కర్నూలు, నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మమ్మల్ని అడిగేదెవరు..?

- అక్రమ సంపాదనే ధ్యేయంగా తెలుగు తమ్ముళ్లు
- పోలీసులు, రెవెన్యూ సిబ్బంది తమ మాట వినాల్సిందేనని ఒత్తిడి
- జీఆర్పీ రిజర్వాయర్‌లో గ్రావెల్‌ను తవ్వేస్తున్న అక్రమార్కులు
- రిజర్వాయర్ కట్టకు పొంచి ఉన్న ప్రమాదం



జీఆర్పీ రిజర్వాయర్‌లో ఎక్స్‌కవేటర్‌తో యథేచ్ఛగా తవ్వకాలు



ఎక్స్‌కవేటర్‌ను తరలించేందుకు వచ్చిన పోలీసులు

మంత్రాలయం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామాల మధ్య ఉన్న గురు రాఘవేంద్ర, బసలదొడ్డి రిజర్వాయరులో తెలుగు తమ్ముళ్ల అక్రమ దందా కొనసాగుతున్నది.

రోజుకు 30 ట్రాక్టర్లు..

రోజుకు 30 ట్రాక్టర్ల గ్రావెల్ కొల్లగొడు తున్నారు. ట్రాక్టరు రూ.2వేల చొప్పున తరలిస్తూ అక్రమార్జన చేస్తూ రూ.లక్షలు దండుకుంటు న్నారు. అంతా మాయిష్టం.. పోలీసులు, రెవెన్యూ అధికారులు మేము చెప్పింది వినాల్సిందే.. అంటూ తెలుగు తమ్ముళ్లు మరీ రెచ్చిపోయి నిత్యం తవ్వకాలు చేస్తున్నారు. తవ్వేకొద్ది డబ్బులు అన్నట్లు తెలుగు తమ్ముళ్లు పోటాపోటీగా ట్రాక్టర్లతో తరలిస్తూ రిజర్వాయరు పంప్‌హౌస్‌కు ప్రమాదకరంగా



ప్రమాదకరంగా రిజర్వాయర్ కట్ట

నెలకొంది. గురువారం సాయంత్రం సుంకేశ్వరి గ్రామానికి చెందిన దాదాపు 20 ట్రాక్టర్లకు పైగా ప్రొక్లెయిన్ సాయంతో గ్రావెల్‌ను తరలించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవి, మాధవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీజ్ చేస్తామని తెలిపారు. అయినా తెలుగు తమ్ముళ్లు అంతా తమ ఇష్టం అంటూ, ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌లను ఎట్లా తీసికెళతారని ఎదురు దాడికి దిగారు. ఇప్పటికే రిజర్వాయరులో భారీ గుంతలు తవ్వడంతో రిజర్వాయరుకు ఉన్న రాతికట్ట కుంగే ప్రమాదం ముంచుకు వచ్చింది. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఇక్కడి పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం జంకుతున్నారు. ఎవరికైనా చెప్పుకోండి.. మమ్మల్ని ఏమీ చేయలేరన్న ధీమాతో తెలుగుతమ్ముళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తెలుగు తమ్ముళ్లకు అడ్డుకట్ట వేయకపోతే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు.

అక్రమంగా గరుసు తవ్వితే చర్యలు



మంత్రాలయం మండలంలోని గురు రాఘవేంద్ర బసలదొడ్డి రిజర్వాయర్‌లో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటాం. జీఆర్పీ రిజర్వాయరులో పెద్దగా గుంతలు తవ్వడంతో రిజర్వాయర్ కట్టకు ప్రమాదం ముంచుకు రావచ్చు. ఇలాంటి వాటికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఎస్. రవి, తహసీల్దార్, మంత్రాలయం

లైంగిక దాడులను అరికట్టడమే లక్ష్యం

• ఆడియో, వీడియో సీడీని ఆవిష్కరించిన కర్నూలు ఎస్పీ బిందుమాధవ్



సీడీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై లైంగిక దాడులను అరికట్టి, రక్షణ కల్పించాలనే ధ్యేయంతో ముందుకెళ్తున్నామని ఎస్పీ జి.బిందుమాధవ్ తెలిపారు. కర్నూలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆడియో, వీడియో సీడీని ఆయన ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ చాలా చోట్ల చిన్న పిల్లలపై లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. పసిపిల్లలు బ్యాడ్ టచ్ జరిగినప్పుడు సమాజానికి భయపడి తల్లిదండ్రులకు చెబితే వారు తిడుతారేమో అని చదువు మానిపిస్తారేమోనని భయపడకుండా డయల్ 100కు గానీ, డయల్ 112కు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. 5 నిమిషాల వీడియో ద్వారా చిన్న పిల్లలకు అవగాహన కల్పించేందుకు కర్నూలు పోలీసులు చర్యలు చేపట్టారన్నారు. పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళలపై నేరాలు, సైబర్ నేరాలుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు కృషి చేసిన కోడుమూరు సీఐ తబ్రేజ్, సంగీత దర్శకుడు ఫయూమ్, గాయకుడు కరీముల్లా, డ్యాన్సర్లు, నటీనటులు, పోలీసులు, విద్యార్థులను ఎస్పీ అభినం దించారు. ఈ కార్యక్రమంలో అడిషన్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్‌పీరా, డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ డీడీపై క్రమశిక్షణ చర్యలు

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గతంలో కర్నూలు, ఆదోనిలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడిగా పని చేసినప్పుడు రూ.35.88 లక్షల ప్రభుత్వ నిధుల్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణపై ప్రస్తుతం ఎమ్మిగనూరులో ఉప సంచాలకుడిగా పనిచేస్తున్న వి.రామునాయక్‌పై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది. 2013-14, 2014-15లో టమాటా రైతులకు అందాల్సిన రాయితీ సొమ్మును, విద్యుత్ పరికరాల కొనుగోలు పేరుతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారనే విజిలెన్స్, ఆడిట్ నివేదికల ఆధారంగా ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం చర్యలు చేపట్టనుంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బోగస్ మస్టర్‌లు నమోదు చేస్తే చర్యలు

క్రిష్ణగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బోగస్ మస్టర్‌లు నమోదు చేస్తే అధికారులపై చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. గురువారం ఉపాధి కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని, కూలీలకు 300 వేతనం అందేలా చూడాలని అలాగే బోగస్ మస్టర్‌లపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఉపాధిలో అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీ వెంట ఎంపీడీవో మోహన్ కుమార్, ఏపీవో నాగ సులోచన, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

పంచాయితీలు చేసి రూ. కోట్లు కొట్టేశారు

• ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిపై ఎమ్మెల్యే పార్థసారథి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని, జనవరి9 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల మధ్య చిచ్చుపెట్టి పంచాయితీలు చేసి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.వందల కోట్లు కొట్టేశారని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని 321ఏలో 6.51 ఎకరాలను స్థానికేతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేసిన కేసులో చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. పరారీలో ఉన్న సబ్ రిజిస్ట్రార్‌తో పాటు, నిందితుల కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయన్నారు. నకిలీ రిజిస్ట్రేషన్ తెలిసిన వెంటే దాన్ని రద్దు చేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. 2021లో ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ హాజీమియా అవుకులో పని చేసేటప్పుడు అక్కడ కూడా ఇలాగే సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ఎవరు తప్పు చేసినా ఊరుకోనన్నారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, విట్టా రమేష్, శ్రీకాంత్ రెడ్డి, ఫక్రుద్దీన్ ఉన్నారు.

గొర్రెల దొంగతనంపై కేసు నమోదు

ఆదోని, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం అంగసకల్లు గ్రామానికి చెందిన గిలక హనుమంతు తన గొర్రెలు పది దొంగతనానికి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. హనుమంతు డిసెంబరు 31న ఆదోని పొలిమేరలో గొర్రెలు మేపుతుండగా క్రాంతినగర్‌కు చెందిన డి.వీరేష్‌తో వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే ఉదయం జనవరి ఒకటో తేదీన పరిశీలించగా పది గొర్రెలు కనిపించలేదు. బాధితుడు గిలక హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదోని టూ టౌన్ ఎస్ఐ రామనాథ్ తెలిపారు.

కందుల కళ..



కల్లంలో ఆరబోసిన కందులు

పత్తికొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన కంది దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో రైతులు పంట కోత చేపట్టారు. పత్తికొండ మండలలో 4,130 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. పత్తికొండ మండలం పెద్దహుల్తి గ్రామంలో 473 ఎకరాల్లో కంది పంటను వేశారు. రైతులు పొలంలోనే దిగుడిని తూర్పారపట్టారు. మరికొందరు రైతులు అప్పటికే తూర్పారబట్టిన కందులను ఆరబెట్టుకున్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి: కలెక్టర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆర్థికాభవృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో యాక్సిస్ బ్యాంక్ రెండవ శాఖను ఆర్డీవో విశ్వనాథ్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకులు ప్రజల జీవనోపాధులకు రుణాలు అందజేసి పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. ముఖ్యంగా మహిళలకు అవసరాల మేరకు రుణాలు అందజేస్తూ చైతన్య దీప్తిగా నిలవాలన్నారు. రైతులకు, విద్యా, గృహరుణాలతో పాలు పలు రకాల రుణాలను అందించేందుకు బ్యాంక్‌లు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ శ్రీనివాసచంద, క్లస్టర్ సేల్స్ మేనేజర్ భ్రమర్‌నాథ్, బ్రాంచ్ మేనేజర్ జగదీష్, ఆర్‌ఎస్ రోడ్ బ్రాంచ్ మేనేజర్ హర్షద్, సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడి'


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామకృష్ణారావు


మిడుతూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పరిశోధకుడు ఎ.రామకృష్ణారావు అన్నారు. మండలంలోని తిమ్మాపురం, మిడుతూరు గ్రామాల్లో గురువారం శనగ పంటలో గ్యాప్ పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త రైతులతో మాట్లాడుతూ శనగ పంటలో ప్రస్తుతం లద్దె పురుగు, కాయ తొలిచే పురుగుల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. విత్తనం విత్తినప్పటి నుంచి 25 రోజుల వరకు గుడ్డు సముదాయాన్ని ఏరి నాశనం చేయాలని సూచించారు. ఎకరాకు 10,000 పీపీఎం వేపనూనెను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పీరునాయక్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జివ్వాజి సుంకన్న గౌడ్ జయంతి


కేక్ కట్ చేస్తున్న కేఈ ప్రభాకర్

నందికొట్కూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణానికి దానకర్ణుడిగా పేరుగాంచిన జివ్వాజి సుంకన్న గౌడ్ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని జువ్వాజి సుంకన్న గౌడ్ విగ్రహానికి మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ పూలమాల వేసి నివాళి అర్పించి చారు. అనంతరం కేక్ కట్ చేశారు. కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ మాట్లాడుతూ జువ్వాజి సుంకన్న గౌడ్ తన ఆస్తులను నందికొట్కూరు పేద ప్రజలకు చదువుల కోసం, హాస్టల్‌కు మున్సిపాలిటీకి, మార్కెట్‌కు, కళ్యాణ మండపానికి పట్టణ ప్రజల అభివృద్ధికి ముందు చూపుతో దానం చేశారని కొనియాడారు. నేటి తరం నాయకులు కూడా ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జజాజ్ రంగస్వామి మాట్లాడుతూ జవ్వాజి సుంకన్న గౌడ్ సేవాసమితి ఆధ్వర్యంలో వైకుంఠ రథం, ఫ్రీజరు బాక్సులు అందజేస్తూ సేవలు చేస్తున్నారన్నారు. కాని వాటిని పెట్టడానికి స్థలం కేటాయించాలని అధికారులను, నాయకులను కోరారు. జవ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, కుమార్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నాగనవీన్



నంద్యాల కల్చరల్/రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ డిస్ట్రిక్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నంద్యాలకు చెందిన ముద్దం నాగనవీన్ నియమితులయ్యారు. నాగనవీన్ నియమించడం పట్ల జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

'విద్యాభివృద్ధికి కృషి చేయాలి'


విద్యార్థులకు టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

పాములపాడు జనవరి 9(ఆంధ్రజ్యోతి) విద్యాభివృద్ధికి అందరూ కృషి చేయాలని టీడీపీ నాయకుడు సింగపూర్ టేకూరి నాగేశ్వరరావు కోరారు. వేంపెంటలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం టిఫిన్ బాక్సులు, పెన్నులు తదితర వస్తువులను ఆయన పంపిణీ చేశారు. మూడు వందల మందికి పైగా విద్యార్థులకు అందజేశారు.

ఆలయంలో చోరీ

పాములపాడు జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగూడూరు గ్రామ శివార్లలోని తెలుగుగంగ కాలువ సమీపంలోని సుంకులా పరమేశ్వరి ఆలయంలో చోరీ జరిగింది. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి ఆలయం తాళాలు పగలగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. తెలుగుగంగ కాలువ సమీపంలో హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారని, హుండీని అక్కడే పడేసి వెళ్లారని తెలిపారు. పాములపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఎస్ఐ సురేష్ కుమార్ వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారిస్తామని చెప్పారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

నేడు వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం


మహానందిలో విద్యుద్దీపాలంకరణలో ఉత్తర గాలి గోపురం


వెంకటాపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం


నంద్యాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు

నంద్యాల కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో శుక్రవారం జరిగే వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని వైష్ణవ ఆలయాల్లో ఆయా కమిటీలు, ఈవోల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు, ఉత్తర ద్వారదర్శనం ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. గురువారం అర్ధరాత్రి నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం వైకుంఠ ఏకాదశి రోజున భక్తులకు ఉదయం 5గంటలనుంచి ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారి దర్శనం కల్పిస్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా పలు రకాలు పళ్లు, కూరగాయలు, పూలు, అరటి తోరణాలు, విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. నంద్యాల పట్టణంలో గుడిపాటి గడ్డలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయం, సంజీవనగర్‌లోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, మూలసాగరంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం, తెలుగుపేటలో వెలసిన మద్దులేటి స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

మహానంది(ఆంధ్రజ్యోతి): మహానందిలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని కోదండ రామాలయంలో వేకువజామున్నే ఆలయ వేదపండితులు,అర్చకులు ప్రత్యేక తిరుమంజన సేవలు నిర్వహించిన అనంతరం కోదండరాముల వారి ఉత్సవ మూర్తుల విగ్రహాలకు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రత్యేక వాహనంపై ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఉత్తర గాలి గోపురం వద్దకు తీసుకొచ్చి భక్తులకు దర్శనం ఏర్పాటు చేస్తారు. అనంతరం కోదండరామాలయంలో లక్ష పుష్పార్చన నిర్వహిస్తారు.

ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి): వెంకటాపురంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు చేసినట్లు ఆ ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శనివారం ఆలయంలో ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామికి వైభవంగా కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'జయప్రదం చేయండి'


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జనవరి 20వ తేదిన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాయలసీమ జిల్లాల ఆధ్వర్యంలో జరగబోవు రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, నాగార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వర్ధన్, అజయ్, రాజేష్, వంశీ, అంజి తదితరులు ఉన్నారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'


మాట్లాడుతున్న ఎంపీపీ యశస్విని

మహానంది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మహానంది మండల అధ్యక్షురాలు యశస్విని సూచించారు. ఎం.తిమ్మాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహమ్మద్ దౌలా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సబ్సిడీ రుణాలను అర్హులను గుర్తించి మంజూరు చేయాలన్నారు. అధికారులకు చెప్పారు. రేషన్‌ను సక్రమంగా కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, ఈవోఆర్డీ నాగేంద్రుడు, ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఏవో నాగేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, ఏపీఎం శ్రీనివాసులు, ఎంఈవో రామసుబ్బయ్య, వైద్యాధికారి వెంకటరెడ్డి, ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

షేక్ ఫాతిమాకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, నాయకులు

నందికొట్కూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు షేక్ ఫాతిమా జయంతి వేడుకలను నందికొట్కూరు పట్టణంలో ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోసి సీఎస్ఐ స్కూల్‌లో ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి మాట్లాడుతూ చీకట్లను చీల్చిన జ్ఞాన కిరణం, విద్యావేత్త, భారతీయ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా తన హయాంలో అగ్రకులాలకు మాత్రమే అందుబాటులో ఉన్న విద్యను తన రచనల ద్వారా సామాన్యులకు కూడా అందేలా చేశారని అన్నారు. ఆమె సోదరుడు షేక్ ఉస్మాన్ ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివిన ఆమె విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజితమ్మ, సీపీఐ నాయకులు ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహానంది, దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి ముందస్తు సంబరాలు

పాణ్యం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సంక్రాతి ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో ఇంజనీరింగ్ విద్యార్థినులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని రంగవళ్లులు వేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు డాక్టర్ సునీత, హరిత వ్యవహరించి విజేతలకు బహుమతులు అందజే శారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిడుతూరు(ఆంధ్రజ్యోతి): మిడుతూరులోని లక్ష్మీచెన్నకేశవ హైస్కూల్ పాఠశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో డీఈవో జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. రంగోలి, గాలి పటాల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో 1 ఫైజున్నీసా, ఎంఈవో 2 శ్రీనాథ్, ప్రిన్సిపాల్ శివకిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వనిత క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ముఖ్య అతిథులు

నంద్యాల కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వాసవీ ఇంటర్నేషనల్ వారి నంద్యాల వనిత క్లబ్ నూతన ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం నంద్యాల మహనందీశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నంద్యాల వనిత క్లబ్ నూతన అధ్యక్షురాలిగా బొగ్గరపు పుష్పలత, కార్యదర్శిగా ప్రసన్న, కోశాధికారిగా స్వర్ణలతలు ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ గవర్నర్ సుబ్బరామయ్య వీరిచేత ప్రమాణస్వీకారం చేయించారు. వాసవీక్లబ్ నందనం, వెంకటాచలం క్లబ్‌ల నూతన ప్రమాణ స్వీకారం కూడా చేయించారు. ముఖ్య అతిథులుగా నంద్యాలజిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కండే శ్యామ్ సుందర్‌లాల్, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్త, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ ట్రెజరర్ నాగసుప్రజ, కోశాధికారి మలిపెద్ది నాగరాజు, రీజనల్ చైర్మన్ నాగశైలజ పాల్గొన్నారు. అనంతరం ముందస్తు సంక్రాంతివేడుకలలో భాగంగా ముగ్గులపోటీలు నిర్వహించారు. ముగ్గులపోటీలకు న్యాయనిర్ణేతగా చిత్తలూరి రాంప్రసాద్ పర్యవేక్షణలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నపిల్లలకు భోగి పండ్ల కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం


విద్యార్థులు ఇచ్చిన నగదును అందిస్తున్న పాఠశాల నిర్వాహకుడు

వెలుగోడు జనవరి 9(ఆంధ్రజ్యోతి): వెలుగోడు మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న వాహీద్ వైద్య ఖర్చుల కోసం వెలుగోడు పట్టణంలోని లిటిల్ ఏంజిల్ పాఠశాల విద్యార్థులు నిర్వాహకుడు ఇమ్మానియేలు ఆధ్వర్యంలో రూ.20 వేలు అందించారు. ఈ డబ్బును విద్యార్థి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ప్రస్తుతం విద్యార్థి కర్నూలులో చికిత్స పొందుతున్నాడు.

కనెక్షన్ లేకపోయినా బిల్లులు వసూలు

- సర్వసభ్య సమావేశంలో ఏసీడీపీవో

పాములపాడు జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాములపాడులోని ఎస్సీ కాలనీలోని అంగనవాడీ సెంటర్ 2లో విద్యుత్ మీటర్ బిగించి కనెక్షన్ మరిచారని, ఏళ్లు గడుస్తున్నా బిల్లులు మాత్రం వసూలు చేస్తున్నారని ఏసీడీపీవో మంగవల్లి చెప్పారు. గురువారం పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరోజినీ వర్జీనియా అధ్యక్షతన ఎంపీడీవో చంద్రశేఖర్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని ఇస్కాల, పాములపాడు తదితర గ్రామాల నుంచి ఉపాధి కోసం గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, కూలీలకు అవగాహన కల్పించి సొంత గ్రామాలలోనే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఇస్కాల గ్రామ సర్పంచ్ మౌళాలి కోరారు. పాములపాడు జడ్పీ హైస్కూల్‌తో పాటు చాలా పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌లు పని చేయక పోవడంతో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ఎంఈవో సుభాషిణిని కోరారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ, ఏవో ఫణీశ్వరరెడ్డి, వెలుగు, విద్యుత్, వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలు నిర్వహిస్తున్న పనితీరు, తదితర అంశాలపై చదివి వినిపించారు. మండలంలోని సమస్యలు పరిష్కరించేందుకే సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నామని, గ్రామాలలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఎంపీడీవో నాయకులకు సూచించారు. వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

నేడు ధర్నా

ఆత్మకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు 3సెంట్ల ఇళ్లస్థలాలు కేటాయించాలని శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు రమేష్‌బాబు, ప్రతాప్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో అనేక మంది పేదలు అర్హులైనప్పటికీ ఇళ్లస్థలాలు మంజూరు కాలేదని అన్నారు. దీంతో సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలోనే అవస్థలు పడాల్సిన పరిస్థితులు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం అలాంటి వారిని గుర్తించి వెంటనే ఇళ్లస్థలాలను పంపిణీ చేయాలని డిమాండ్‌తో చేపట్టబోవు ధర్నాలో సీపీఐ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. నాయకులు రాజు, నరసింహ ఉన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అతావుల్లా, ఉపాధ్యక్షుడు మద్దిలేటి డిమాండ్ చేశారు. గురువారం కొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సద్దాం నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఎం

ఆత్మకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు రణధీర్, వీరన్న, రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ రెండు సెంట్ల స్థలాన్ని ఇచ్చి గృహనిర్మాణ పథకం కింద రూ.5లక్షల సాయం అందించాలని అన్నారు. 2001 నుంచి 2003లో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారని అన్నారు. ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితులను న్యాయం చేయాలని అన్నారు. అదేక్రమంలో జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లస్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు కూడా వెంటనే ఇళ్లస్థలాలు ఇవ్వాలని తెలిపారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

177 మంది విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

నంద్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు తమ కళాశాల విద్యార్థులు 177మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ గురువారం తెలిపారు. కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అంతర్జాతీయ సంస్థ ఓ ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల నైపుణ్యాలు, సామర్థ్యాలను అంచనావేసేందుకు పోటీ పరీక్ష, ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఈ ప్రక్రియలో మెకానికల్ ఇంజనీరింగ్ నుంచి 37 మంది, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ నుంచి 69మంది, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ నుంచి 71మంది మొత్తం 177మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వీరికి రూ.17,500 వేతనంతో పాటు ఇతర అలవెన్స్‌లను చెల్లిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, ఒణియాన్, కళాశాల ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్లు ఈశ్వరయ్య, షఫీ, షరీఫ్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

'కేసు నమోదు చేయాలి'

నందికొట్కూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండలం తమ్మరాజుపల్లెలో అంగన్‌వాడీ వర్కర్ జయలక్ష్మిపై దాడి చేసిన శివకుమార్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసు రత్నం డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం సీఐటీయూ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసు రాజీ చేసుకోవాలని శివకుమార్ అంగన్‌వాడీ వర్కర్‌ను ఇప్పటికీ బెదిరిస్తున్నారని అన్నారు. సీఐటీయూ నందికొట్కూరు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, నాయకులు నాగన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

గడివేముల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం కోసం జీవో విడుదల చేయడంపై అఖిలభారత వడ్డె ఓబన్న సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బీబీఎన్ రాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వడ్డెర సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీసీ వెల్ఫేర్ మంత్రి సవితకు ధన్యవాదాలు తెలిపారు.

స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలు


ర్యాలీలో పాల్గొన్న సమితి సభ్యులు, విద్యార్థులు

నంద్యాల కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల లో స్వామి వివేకానంద 162వ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించి, స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో రామక్రిష్ణా డిగ్రీ కళాశాల, వెలాసిటి, న్యూక్లియస్ జూనియర్ కళాశాల విద్యార్థులతో మున్సిపల్ టౌన్ హాలు నుంచి శ్రీనివాస సెంటర్ మీదుగా గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కల్పన సెంటర్‌లోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. గంగిశెట్టి విజయకుమార్, లాయర్ రామచంద్రారావు, 12వవార్డుకౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్‌లాల్, చలంబాబు, నిమ్మకాయల సుధాకర్, రాజారామ్, నాగేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం పరిశీలన


శ్మశానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

నంద్యాల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి); పట్టణ శివారు ప్రాంతమైన వైఎస్సార్ నగర్‌లోని శ్మశానాన్ని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్‌తో కలిసి పరిశీలించారు. శ్మశానంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రతలు పాటించాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని కమిషనర్ సూచించారు. వీరి వెంట 38వ వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు, నందము బాబురావు, వడ్డె నాగేంద్ర, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫణీంద్రకుమార్ అభినందనీయుడు



ఫణీంద్రకుమార్‌ను సత్కరిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం పసుపుల గ్రామానికి చెందిన ఫణీంద్రకుమార్ రీసైక్లింగ్ ఆర్ట్‌లో రెండోసారి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సాధించడం అభినందనీయమని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. గురువారం బీసీ రాజారెడ్డి కార్యాలయంలో ఫణీంద్రకుమార్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ ఖాళీ సిగరెట్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, ఫ్యాబ్రిక్స్ తదితర వ్యర్థాలతో ఆయన చేసిన డీఎస్‌పి మోడల్‌కు రెండోసారి ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కిందన్నారు. కార్యక్రమంలో కోటా శివశంకర్, భాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి, మణికంఠ పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

డోన్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి డిమాండ్ చేశారు. గురువారం పలు పార్టీలతో కలిసి మండలంలోని కొత్తకోటలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, పట్టణ, మండల కార్యదర్శులు నారాయణ, మోటరాముడు, సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు, బీఎస్‌ఎఫ్ నాయకులు విజయభాస్కర్, ఆర్‌పీఐ నాయకులు చిరంజీవి, డీవైఎఫ్ఐ నాయకులు నక్కి హరి పాల్గొన్నారు.



కొత్తకోటలో నిరసన తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

డోన్‌లో ఉచిత వైద్య శిబిరం

డోన్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామచంద్ర మాలిక్ బాబా ఆలయంలో గురువారం భక్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రామచంద్రమాలిక్ బాబా సంస్థాన్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి హైదరాబాదు, విజయవాడ నుంచి ప్రత్యేక డాక్టర్లు వచ్చి బీపీ, షుగర్, గుండె జబ్బులకు సంబంధించిన వాటికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రత్యేక డాక్టర్లు హైదరాబాదు నుంచి డా. ఈమని శ్రీనివాసరావు, విజయవాడ నుంచి కె. లతతోపాటు ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముందస్తు

సంక్రాంతి

ఆకట్టుకున్న హరిదాసు వేషధారణలు

చాగలమర్రి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బాలికలు, ఉపాధ్యాయినులు చేపట్టిన హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి. సాంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేసే కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హరిదాసు కీర్తనలు అందర్నీ అలరింపజేశాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు హెచ్‌ఎం విజయలక్ష్మి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సాయి విజేత ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉపాధ్యాయుల కు కరస్పాండెంట్ సుబ్బు యాదవ్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో సంక్రాంతి వంటకాలు



డోన్‌లో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ సుబ్బు యాదవ్



హరిదాసు వేషధారణలో ఉపాధ్యాయులు

ప్యాపిలి: పట్టణంలోని ప్రియదర్శిని, శివసాయి పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు ముగ్గల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



కోవెలకుంట్లలో అష్టలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయం



రుద్రవరం మండలం వాసాపురంలో ముస్తాబైన వెంకటేశ్వర ఆలయం



అవుకులో పూజలు అందుకుంటున్న చెన్నకేశవస్వామి మూలవిరాట్

కోవెలకుంట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని జమ్మలమడుగు రహదారిలో వెలసిన అష్టలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించే శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఏకాదశి రోజున స్వామివారికి అభిషేకం, అర్చన, పూజా కార్యక్రమం శ్రీనివాస గోదాదేవి కళ్యాణం తదితర వాటిని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక వేద పండితులచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపను పొందాలని ఆయన తెలిపారు.

రుద్రవరం: మండలంలోని వాసాపురం, రుద్రవరం సమీపంలోని దొర్ని క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు గురువారం వాసాపురం వెంకటేశ్వర ఆలయం చైర్మన్ మధుసూదన రెడ్డి, వైస్ చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి కాణాల నరసింహుడు, దొర్ని క్షేత్రం నిర్వాహకుడు శ్రీను తెలిపారు. వాసాపురంలో లక్ష్మీగోదాదేవి సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామి, దొర్నిలో లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారు కొలువై ఉన్నారు. దొర్ని క్షేత్రంలో ఉత్తర ద్వారంతోనే దేవాలయం నిర్మాణం చేపట్టారు. భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ప్యాపిలి: పట్టణంలోని చెన్నకేశవస్వామి, వెంకటేశ్వరస్వామి, రామాలయం, ఆంజినేయస్వామి ఆలయాలను వైకుంఠ ఏకాదశి వేడుకలకు నిర్వాహకులు ముస్తాబు చేశారు. ఆలయాల్లో వైకుంఠ ద్వారం ఏర్పాట్లను కూడా ఏర్పాటు చేశారు. భక్తులు వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

అవుకు: అవుకు పట్టణంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అర్చకులు బంగారయ్య గురువారం తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున స్వాముల వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ద్వార స్వాముల వారిని భక్తులు దర్శించుకునే ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే మద్దిలేటిస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో హిందువుల అతి పెద్ద పర్వదినం వైకుంఠ ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధమైంది. కొలిమిగుండ్ల చెన్నకేశవస్వామి, బెలుం రామాలయం, శ్రీకృష్ణ మందిరం, పలు గ్రామాల ప్రముఖ ఆలయాల్లోనూ అభిషేకాలు, పూజలు, గ్రామోత్సవాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని జమ్మలమడుగు రహదారిలో వెలసిన అష్టలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి వేడుకలు పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఏకాదశి రోజున స్వామివారికి అభిషేకం, అర్చన, పూజా కార్యక్రమం శ్రీనివాస గోదాదేవి కళ్యాణం తదితర వాటిని నిర్వహిస్తామన్నారు.

సంజామల: సంజామలలో వెలిసిన వనం వెంకటేశ్వరస్వామి, పేరుసోమలలోని చెన్నకేశవ స్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో శోభయమానంగా అలంకరించారు.

జిల్లా విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బాల నాగన్న

బనగానపల్లె/ కోవెలకుంట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బోధనం బాలనాగన్నను ఎంపికయ్యారు. ఈయనది కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామం. ఈ మేరకు జిల్లా సాంఘిక సంక్షేమ సూపరిండెంట్ జమునకుమారి, చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. బోధనం బాలనాగన్న మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సహకారం వల్లనే తనకు ఈ పదవి లభించిందని తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న బాలనాగన్న

నేడు మంత్రి బీసీ గ్రీవెన్సు

బనగానపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం గ్రీవెన్సు కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రజలకు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని బనగానపల్లె పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్ గురువారం తెలిపారు. నంద్యాల జిల్లా ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి మంత్రి బీసీ అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

తొక్కిసలాటపై మంత్రి విచారం

బనగానపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీవారి భక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

రుద్రవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం పట్ల గర్భిణులు శ్రద్ధ చూపాలని వైద్యాధికారి అమర్‌నాథరెడ్డి అన్నారు. గురువారం ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృఅభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్లే తల్లీ బిడ్డ సురక్షితంగా ఉంటారని అన్నారు.

నరసింహులు సేవలు మరువరానివి

రుద్రవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొల్లం నరసింహులు (79) సేవలు మరువరానివని శ్రీకృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి నరసింహులు అన్నారు. బ్రెయిన్ ట్యూమర్‌తో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మృతి చెందాడన్నారు. దిగువ అహోబిళంలో 50 సెంట్ల స్థలాన్ని శ్రీకృష్ణరాయ చారిటబుల్ ట్రస్టు భవనం నిర్మించేందుకు స్థల సేకరణలో ఆయన హస్తం బలంగా ఉందన్నారు. ఆయన మృతి పట్ల ప్రముఖులు నివాళి అర్పించారు. రుద్రవరంలో గురువారం జరిగిన అంత్యక్రియలకు పలువురు హాజరయ్యారు. కార్యక్రమంలో సుబ్బారావు, ప్రవీణ్, శ్రీను, మాజీ సర్పంచ్ పోలా గురుమూర్తి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు పుల్లయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహ నిర్మాణాల బిల్లులు చెల్లించండి

ఉయ్యాలవాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 2018లో నిర్మించుకున్న ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు చెల్లించాలని అల్లూరు గ్రామ సర్పంచ్ మాదరి క్రిష్ణవేణి కోరారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం జరిగింది. 2018 టీడీపీ ప్రభుత్వంలో నిర్మించుకున్న గృహాలకు ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిలిపి వేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని సర్పంచ్‌లు కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఎంపీపీ విద్యుత్ ఏఈని కోరారు. దీనికి ఏఈ గుర్రప్ప స్పందిస్తూ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు. గ్రామాల్లోని అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రామ్‌కో ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లెలో గురువారం రామ్‌కో సిమెంటు పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల సమస్యల తో బాధపడుతున్న 230 రోగులకు వైద్యులు చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు ఆదేశాల మేరకు రామ్‌కో మైన్స్ జీఎం అజ్మల్‌అహ్మద్, డీఎంజీ జియాలజీ నాయుడు నరేష్, డా.శశిధర్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం అటెండర్ మృతి

కొలిమిగుండ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలంగా కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న కంబగిరి రాముడు (55) గురువారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఎంపీడీవో ప్రసాదరెడ్డితోపాటు, పలువురు ప్రభుత్వ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు రాముడు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

17 వాహనాలకు రూ.3.12 లక్షల జరిమానా

బేతంచెర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్ గురువారం వాహనాలను తనిఖీ చేశారు. 17 వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు లేకపోవడంతో రూ.3,12,010 జరిమానా విధించినట్లు ఎంవీఐ తెలిపారు. 3 ట్రాక్టర్లు, 3 హెవీ గూడ్స్ వాహనాలు, 2 లైట్ గూడ్స్ వాహనాలు, 2 ఆటోలు, 4 టాటా మాజిక్ మ్యాక్సీ క్యాబ్, 2 తుఫాన్ వైట్ బోర్డు వాహనాలు పరిమితికి మించి విద్యార్థులతో వెళ్తున్న ఒక స్కూల్ వ్యానును సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి: ఆర్డీవో



ఉప్పలపాడులో మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహులు

అవుకు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు రీసర్వేకు సహకరించాలని డోన్ ఆర్డీవో నరసింహులు అన్నారు. గురువారం ఉప్పలపాడు గ్రామంలో ఇన్‌చార్జి తహసీల్దార్ నారాయణరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి భూ రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు డోన్ ఆర్డీవో నరసింహులు, డివిజనల్ సర్వేయర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి గ్రామాల వారిగా భూ రీసర్వే ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంగళరెడ్డి, సర్వేయర్ హరిక్రిష్ణ, వీఆర్వో చంద్రహాసరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఆర్డీవో నరసింహులు అన్నారు. గురువారం మండల పరిధిలోని అమడాల గ్రామంలో ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే భూముల రీసర్వే కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహించారు. డోన్ ఆర్డీవో కేపీ నరసింహులు మాట్లాడుతూ మండలంలో ఒకే గ్రామాన్ని ఎంపిక చేసి రోజుకు 20 ఎకరాలు మాత్రమే శాటిలైట్ ద్వారా రీసర్వే చేస్తామన్నారు. దీని వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. రైతులు అపోహలు వీడి రీసర్వే కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు పవన్ కుమార్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయరు క్రిష్ణకుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చాగలమర్రి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కర్నూలు, కడప కేసీ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ రామలింగారెడ్డి అన్నారు. గురువారం రాజోలి ఆనకట్టను సందర్శించారు. ఆనకట్ట వద్దగల నీటి మట్టాన్ని, పక్కనే ఉన్న కేసీ ప్రధాన కాలువను పరిశీలించారు. కాలువల స్థితిగతులు, నీటి సామర్థ్యాలను కేసీ కెనాల్ డీఈ పుల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించేలా పంట కాలువల పనుల మరమ్మతుల ప్రతిపాదనల అంచనాలు వేయాలని సూచించారు. కేసీ ప్రధాన కాలువకు మార్చి చివరి వరకు రెండో పంటకు సాగునీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు వైస్ చైర్మన్ గురివిరెడ్డి, డీసీ చైర్మన్ హరి, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్, డబ్ల్యూఏ చైర్మన్‌లు, కేసీ కెనాల్ ఏఈలు జమాల్‌వలి, పవన్‌కుమార్‌రెడ్డి, గురుమోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు, గంగిరెడ్డి, సూపర్‌వైజర్ దస్తగిరి పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

చాగలమర్రి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని వాసవీ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన జాబ్‌మేళా నిర్వహించారు. కడప జిల్లాకు చెందిన ఆల్‌డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి సాయిసునీల్ మాట్లాడుతూ జాబ్‌మేళాకు 110 మంది యువతీ యువకులు హాజరయ్యారని, ఇందులో 90 మందిని ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రఘురామ్, రమణ, కార్యదర్శి పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాబుద్దీన్, ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య, సూపర్‌వైజర్ నితిన్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని సీఐ మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐగా ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ కంబగిరి రాముడు నంద్యాల మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీకాగా కర్నూలు సీసీఎస్-2 నుంచి మురళీధర్‌రెడ్డి ఆళ్లగడ్డకు బదిలీపై వచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సీఐ మురళీధర్‌రెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

డోన్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఎస్‌ఆర్ స్వగృహంలో నూతన సంవత్సర డైరీని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్ మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య, డోన్ టీడీపీ యువ నాయకులు గౌతమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు కల్యాణ మహోత్సవం

దొర్నిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకరాజువేముల గ్రామంలో వెలసిన చెన్నకేశ దేవాలయంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి చంద్రుడు, ఎండూరి గోపాల్‌నాయుడు తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా భక్తులు తరలివచ్చి విశేష పూజల్లో పాల్గొనాలని కోరారు.

అభివృద్ధికి తోడ్పాటు అందించండి

దొర్నిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంపీడీవో సావిత్రి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రమీల మాట్లాడుతూ సొసైటీ సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న ప్రతి రైతు ఆయా గ్రామాల సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. విద్యుత్ ఏఈ రామమోహన్ మాట్లాడుతూ సబ్సిడీపై తమ ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవాలని అన్నారు. పీఆర్ ఏఈ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ మండలంలో రూ.2.40 కోట్లు సీసీ రోడ్లకు మంజూరైనట్లు తెలిపారు. తహసీల్దార్ సుభద్ర మాట్లాడుతూ మండలంలోని అర్జునాపురం గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైందని అన్నారు. హౌసింగ్ ఏఈ బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రధాన మంత్రి యోజన కింద మంజూరైన ఇంటి నిర్మాణాలను త్వరగా నిర్మించుకోవాలని అన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, ఎన్ఆర్ఈజీఎస్ గంగన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, వెలుగు ఏపీఎం బాబు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శకుంతల, వైద్యాధికారులు ఉసేన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

బేతంచెర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్దిలేటి స్వామి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు పురస్కరించుకుని పాలపండ్ల బండలాగుడు పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆలయ మాజీ చైర్మన్ మండల టీడీపీ కన్వీనర్ ఎల్లనాగయ్య హాజరై ప్రారంభించారు. ఈ పోటీలకు 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. నాగర్ కర్నూలు రాయమవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి ఎద్దులు ప్రథమ బహుమతి రూ.50వేలు, నంద్యాల పాణ్యం మండలం పిన్నాపురం గ్రామానికి చెందిన వెంకటకృష్ణయ్య ఎద్దులకు రెండో బహుమతి కింద రూ.40వేలు, కడప జిల్లా కాలసపాడు గ్రామానికి చెందిన భేతి వెంకటరెడ్డి ఎద్దులకు మూడో బహుమతి రూ.30వేలు, అనంతపురం జిల్లా ఆత్మకూరు విశ్వనాథరెడ్డి ఎద్దులకు నాలుగో బహుమతి రూ.20వేలు అందజేశారు.

పని వేళలు పాటించని వెలుగు సిబ్బంది

బేతంచెర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయ సిబ్బంది పని వేళలు పాటించడం లేదు. అధికారులు 11 గంటలైనా రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు, పొదుపు మహిళలు వేచి చూసి పడిగాపులు కాస్తున్నారు. పని నిమిత్తం కార్యాలయం వద్దకు వెళితే అధికారుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందని సీపీఎం నాయకుడు మధుశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.



12 గంటలైనా ఖాళీగా ఉన్న కుర్చీ